టుప్‌టీక

మేడ మెట్లమీద --

ఎక్కి....పైకి వెళ్ళిపోయి...గదిలో తలుపులు బిగించుకు కూచుని....ఏరాతో చదువో మొదలు పెట్టి...లేకపోతే యింకా పై అంతస్తుకు వెళ్ళి ...ఎక్కడో బజారులో రేగే రొదకు చెవిదోరచేసి ఏమైనా ఆ మూలుగుమాత్రం వినలేక. ..ఏమైనా చేసేందుకు, తన చేతిలో ఏమీలేక...తల్లడిలిపోతున్నాడు: అక్కడ నిలవడానికి, తరం కావడంలేదు.

పళ్ళు బిగివిని నాలుగుమెట్లు ఎక్కాడు. అయిదో దాని మీద అడుగు వేయబోతూండగానే....ఇక కాళ్ళు చప్పగా చప్పబడ్డవి. క్రిందనుంచి, మళ్ళా, మూలుగు వినబడ్డది. ఇక అంతటితో నిలుచున్నవాడు అపాళనే అక్కడే కూలబడి పోయినాడు.

అంథా– గందరగోళంగా ఉంది. ఆ గదిదగ్గర అందరూ, కొందరు లోపలా, లోపల యిరక లేనివారు బయిటా చేరి, ఒక్కసారిగా మాట్లాడుతూ, రణగుణధ్వని చేస్తున్నారు. అంత మోతలోనుంచి ఉండి ఉండి మూలుగు వినబడుతూంది.

తాను అది, వినలేడు; పిల్లది ఉవ్వెత్తుగా మూలిగినపుడు లోపలికి జొరబడి పొదివి పట్టుకుని నీకేం భయం లేదమ్మా తల్లీ నేనున్నాను అని గడచి బయటపడేదాకా అక్కడే కూర్చుంటే...

ఉహూ....గుమ్మందగ్గరకు వెళ్ళేటప్పటికి...అత్తగారు అడ్డంగా నుంచుని, కదలక, మెదలక, ధీమాగా "ఇక్కడ మగవాళ్ళ ప్రమేయం ఏమీలేదు...నీవు అవతలికి వెళ్ళు" అని ఉన్న సందుకు చేయి అడ్డం జాపింది; ఆ మాట లెక్క సేయకుండా అలాగే, లోపలికి, నిలుచున్న చోటునుంచి అంతమేరా సాగి...తొంగి చూశాడు. అమ్మాయి ముఖం మాత్రము, కనబడ్డది.. "నేనుచచ్చిపోతున్నాను, నాన్నో!" అని, గావుకేక వినబడ్డది...తనకు యిక ఆగక.. .బావురుమన్నాడు...అత్తగారు అందుకైనా చలించకుండా...కనికరం, జాలీ, ఏకోశానా లేకుండా... నిర్లక్ష్యంగా అవతలకు... దృఢంగా నెట్టివేసింది. మూతి నాకడానికి ఎగిరి...ముట్టెమీద దెబ్బతిని...కంయి, కంయి...మనకుండా తోకముడుచుకునే పరువుగా అక్కడనుంచి బయటికి వెళ్ళిపోయే...జాతికుక్క...దాని నోరూ వాయాలేదు. దానిలాగునే...ఉన్నా...తాను లోపల కుమిలిపోవలసిందే...

అక్కడ – అలా దిగులుగా – మోకాళ్ళమీదకు తలదించుకొని కూర్చుంటే, ఒక్కరూ వచ్చి ఓదార్చరేం? ఆ అల్లుడు వెధవాయ – అవతలగదిలో కూర్చుని – ఫోను విడవకుండా పాడిస్తూ – చక్రం తిరగవేసే వ్యవధిలో – కూని రాగం అఘోరిస్తూ – అక్కడలా భార్య తాను పెళ్ళి కూతురులాగా – చెంగ్ మంటూ తానక్కడ కూర్చుని ఉండగానే – నాలుగు మాట్లు – తనని రాచుకుంటూ – తప్పుకోమని అయినా అడగకుండా – పైకీ క్రిందకీ పరుగులెత్తుతూంది –

పలుకరించేందుకన్నా – ఏం, అలా కూర్చున్నారని ఒక్క ముక్క అనడానికైనా ఆమెకు ఆ సంబరంలో – అసలు తానక్కడ ఉన్నట్టు కనబడితేనా --

అమ్మాయి – అక్కడపడుతున్న బాధ వినలేక పోతున్న కొద్దీ – తనలోకి – తానుగా – వెనుకకు వెళ్ళిపోయి – మనసులో --

అప్పటి ముచ్చట – తానూ – తను చేసిన నిర్వాహకానికి – తలక్రిందులైపోతూంటే – చీమన్నా కుట్టనట్టుగా కుదురుగా కూర్చున్నాడు. మామగారు, ఎదురుగుండా నూతిగట్టు అరుగుమీద – తాపీగా చుట్టకాల్చుకుంటూ – పాదాలదగ్గిర రెడ్డిగం వేసుకుని కూర్చున్న పాలెకాపుతో – అంతకుమించి, ముహూర్తం కుదరనట్టు...అప్పుడు వ్యవహారం ఏడుస్తున్నాడు. ఇక, తన భార్య...తామూ చిన్నతనంలో – తెలిసినంతవరకూ యింతకన్న...యిప్పటివాళ్ళకన్న...ఎక్కువముద్దూ ముచ్చటతోటే ఉన్నారు.

కన్నులు బాగా తెరవక ముందే... గారాబాల కూచి గనుక..కాపురానికొచ్చింది భార్య. యిద్దరికీ బాగా పసితనమే...పైన కనిపెట్టి చూసే...పెద్దలు ఆకాశంలో ఉన్న వారి, వారి పెద్దలూ తరించేందుకు...పండుగలో అదొకటిగా పడకలుగా ఏకం చేశారు...కడుపు పండితే ఆ పండును చూచుకుంటూ....కన్నులున్నందుకు...

అందరి తపసూ ఫలించినది...అనుకున్నంతపనీ జరిగింది...ఇక...అమ్మాయికి సూడిదెలూ...అసలు...ఒక్కపిల్ల... అందుకని...అరచేతుల్లో పెట్టుకుపెంచారు...ఇక...అక్కడనుంచి నెత్తినే పెట్టుకుని...ఆఁ అంటె అమ్మాయి, ఓపలేనిది...ఎక్కడ అరగిపోతోందో అని...అతి గారాబంగా...సరి, అదంతా బాగానే ఉంది...

తానూ...అందలంలోంచి దిగలేదు:

ఆ గడియ వచ్చింది.

అక్కడ ....లోపల...మామగారితో, అత్తగారు... "అమ్మాయి...యిందాకనుంచీ... కొంచెం నలిగి ఉంది. ఆడేపొద్దులే...ఎందుకైనా మంచిది – కేకేసిరండి--" అనడం విన్నప్పటినుంచి...బిక్కమొగం వేసుకుని--అటూ యిటూ తిరుగుతూ...ఆవాళకూడా, మామూలుగా భార్య, గదిలోకి నిద్రవేళకు వస్తుంది కదా. అప్పుడు చేతనైన ఉపచారం చేయవచ్చునని -- ఆదుర్దాగా – అక్కడే తారట్లాడుతూ....అడుగులు లోపల చప్పుడుకాగానే...ఆమె... వస్తూందని ...ఆలకిస్తూ...ఆవలింతకు....చేయడ్డము పెట్టుకుని ఆపుకుంటూ--

అత్తగారు...ఏదోపనిమీద – ఆవేపునుంచి మరో గదిలోకిపోతూ...తన్ను చూచి -- "పోయి పడుకోనాయనా, ప్రొద్దుపోయింది...అమ్మాయికి...బద్ధకంగా ఉంది-- అది యిక్కడే పడుకుంటుంది--ఆనక లేద్దుగానివిలే...." అంది... అంతతో ఆరాటం హెచ్చె – ఆ అమ్మాయి పడుకున్న చోటికి ... ఒక్క అంగలో వెళ్ళాడు-- సన్నంగా మూలుగుతూంది; మీద, చేయివేసి – ఏమేమో అడగబోయినాడు; ఉలిక్కిపడి....కళ్ళు తెరిచిచూసి--పళ్ళు బిగించుకుని. ...నిట్టూర్పు విడిచి – ప్రక్కకు ఒత్తిగిలి – పడుకుంది –

అత్తగారు – అంతలోనేవచ్చి – వెనుకనుంచి పకాలుమనగానే – తగని బిడియవేసి, అక్కడి నుంచి...తలవంచుకుని – వచ్చేస్తున్నాడు – మంత్రసాని – లోపలికి వస్తూంది – మామగారు, – అంత పెద్దవాడు, మర్యాదస్తుడు – తనవంక కొంటెకోణంగిలాగా

చూసి – వినబడేటట్టు గొంతు సవరించుకుని – అదిగో ఇవాళలాగానే అక్కడే అదేమాదిరి – ఆ అరుగుమీదనే బాసిపట్టు వేసుకుని – చుట్టుకొస కొరుకుతున్నాడు–

ఏం చేయడానికి తోచడంలేదు – ఎంత అణచుకుందామన్నా, ఆగక, వెక్కి వెక్కి ఏడుపు పెగుల్చుకు వస్తూంది. ఎవరూ వినకుండా – ఎవరికీ కనబడకుండా, తోట వెంటా, దొడ్డివెంటా, అంతసేపూ, కాలుగాలిన పిల్లిలాగా తిరుగుతూ – తోచిన దేవతల కెల్లా మ్రొక్కుకుంటూ – ఎంతసేపో – వేళ తెలియలేదు.

అమ్మాయి – భూమ్మీదపడ్డది – తెల్లవారుతూండగా ఆ మాట – తాను ఏమూలో ఉండగా – ఎవరో వెదుక్కుంటూ వచ్చి – చల్లగా – చెప్పారు:

మంచి నక్షత్రం – ఏవిధమైన శాంతి – దోషమూ లేదు – అందుకని – తెల్లవారినతరువాత ఆ గదిలోకి – తానొకసారి వెళ్ళి, పిల్లనూ, తల్లినీ చూడవచ్చునన్నారు.

కందగడ్డలాగా ఉంది – కనుముక్కు తీరు ఏం – కనుబడలేదు–పొత్తిళ్ళలో అణగిమణగి – అమ్మప్రక్కను – నీళ్ళు పోసుకుని అప్పుడే – పడుకుందట: మోకాళ్ళమీదికి బట్ట ఎగలాక్కుని జేనెడు పీటమీద గొంతుకూర్చుని అక్కడ కనిపెట్టుకునిఉన్న ముసలమ్మ "అచ్చంగా నీ పోలికేరా బాబూ! ఆ జుట్టూ – ఆ నొసలూ – ఆ గొంతూ – అన్నీ అచ్చంగా నీవే – – అమ్మాయి పోలిక ఒకటీ అబ్బలేదు – ఆడపిల్లకూ ...అదీ ఒక అదృష్టమే – " ఆవిడకు ఉత్సాహంతో బాటు గొంతుకు హెచ్చిపోతుంది – ఆ గొడవకు – తన భార్య – కన్ను తెరచింది––

కనబడేటట్టు, యింకా ముందుకు వెళ్ళినిలుచుకున్నాడు.

తెరచిన కన్ను – తననుచూసీచూడగానే – మూసుకుంది.

కాని, ఆ రెప్పపాటులోనే – అలా ఆ చూపులో –

అమిత భయం – తలచుకుంటే జలదరించిపోయే అసహ్యమూ – కళపెళలాడినవి.

తల్లికావడంలో – అంతకుముందు ఆ యాతన కలలో అయినా ఊహించని అమాయకురాలు – తల మునకలైన హడలు – తన భార్యలో – ఆ క్షణం నుంచీ – అలాగే, నిలిచి పోయింది.

బాలింతతనము తీరిన – మొదటిరోజుల్లో, మరీనీ తాను కంటబడితే – దయ్యం మీదకు వస్తూన్నంత భయంతో, దద్దరిల్లి పోయేది; కాలంగడచినా – ఎన్ని విధాల – అనునయించి, ఆ భయం తీర్చాలనీ – తన శాయశక్తులా ప్రయత్నం చేసినా – ఎన్నికలో – మన్నికలో మామూలుగానే ఉండేది; కాని, మనసుపట్టలేక – ఆమాట ఊసు ఎత్తేసరికి – అక్కడితో ఆమెకు వెఱ్ఱు లెత్తుకు వచ్చేవి.

ఎవరితో చెప్పేసంగతి కాదు: ఎవరూ తీర్చేది కాదు.

ఏమిచేసి, ఆమెను మళ్ళా దోవకు మళ్ళించాలో, తోచలేదు.

ఎన్నో పుస్తకాలు చదివాడు, ఎన్ని ఉపాయాలో ఆలోచించాడు.

ఎందరెందరినో – ఏదో కథగా – దీనికి విరిగుడు ఏం ఉంటుంది – అని – శాస్త్ర చర్చగా – కదలేసి చూశాడు. ఎవరికి తోచిన ఉపాయాలు వారు ఉపదేశించారు – కాని, వేనివల్లనూ వీసంఎత్తు పని జరగలేదు...

ఆ అమ్మాయిలో, అంతకుమించిన మార్పేమీ లేదు.

అనురాగానికీ, ఆదరణకూ, ఆమె తనకు - ఆమె ఆ విధంగా ఎన్నడూ - ఏలోటూ చేయదు.

కాని, అదొక్కటే, తీరనిలోటు.

ఆఖరికి - ఇక ఆ మాట తలపెట్టకుండా అమ్మాయి ముద్దుమురిపాలు చూసుకుంటూ, అలా కాలం వెళ్ళబుచ్చడమే - యీ జీవితంలో - ఆ తొలిరోజుల ముచ్చటయేగాని, మళ్ళా అంత అదృష్టంపట్టే యోగం కరవైందని - రూఢి పరచుకున్న తరువాత - అమ్మాయిని చూసుకుంటూ - యిద్దరూ, అదోమాదిరి - హాయితోనే బ్రతుకుతున్నారు - పిల్లదానితోబాటు, పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. అంతేగాని అంతకు మినహాగా, మారిపోయేందుకైనా - అనుభయం అంటూ ఏదీ?

తన - నడినెత్తిన - వెనుకటికన్న కొంచెం - జుట్టు ఎత్తు తగ్గి పలచబడుకుంటూ వస్తూంది: తనభార్య, అప్పటికన్న కొంచెం బొద్దుగా ఉంది - నిగనిగలాడే ఆమె మొగమూ, నున్నని బుగ్గలూ - చూసి - ఎన్నడన్నా - ఓనాడు - ఎన్ని ఏళ్ళకో ఓమారు - మనసులో - చిన్నతనం, జ్ఞాపకం ఆగక, బెల్లించబోయినా - బెట్టుచెడి - గుట్టుదాగకపోవడమే కాని సరి - ఏమనుకుంటేనేం - ఏనాటి పాపం - ఏమో - పుణ్యమో, ఎవరి ఎడబాటుకు ఏ జన్మంలోనైనా - తాను కారకుడు ఏమో - యీనాటికి - తనదోషం ఏమి లేకుండానే - తనకు, తనతో ఆమెకూ, సౌఖ్యపడేయోగం కరవవడం -

అయిపోయిన దానికి కాదు - ఆలోచన -

అమ్మాయి - అల్లారుముద్దుగా-వాళ్ళ అమ్మకు వాళ్ళ అమ్మా నాన్నా చేసినదానికన్న ఎక్కువ గారాబంతో - పెరిగి పెద్దదయింది -

తాను - యిల్లరికం - తనతోబాటు - తన అల్లుడూ యిల్లరికం - ఆ యింటనే-అలా ఎన్ని తరాలదాకా అయినా - ఉండేందుకు అన్ని విధాలా వసతి ఉన్నది.

అందుకు కాదు - అనువాయత తప్పకుండా వస్తూందేమో అని - తపించి పోతూన్నది-అందుకూ; అత్తవారికి తన భార్య తరువాత మళ్ళాసంతులేదు-అంతే దేవుడిచ్చాడో లేక-

అలా అనుకున్నప్పుడే - గుండె తల్లడిల్లుతూంది. ఆ యింట ఉన్న ఆడదానికి - కదళీవంధ్యా - దోషం - అమ్మాయికీ - తల్లిముత్తవల - చాలిక - తప్పదా ఏం - చిలకా గోరింకల్లాగా, వాళ్ళైనా - యిల్లు పదియిళ్ళయేటట్లుగా - కలసి కడుపు ఫలింపజేసుకోకుండా - తమలాగానే - తయారవుతారా -

ఆ మాటే - ఆ ఆలోచనే - భయంవేసే సుడిగాతలలో - తనలో తిరిగిపోతూ - మిగతా ఊహల నన్నింటినీ పీల్చుకుని ముంచేస్తూంది. అమ్మాయి - జీవితం - తమలాగా కాకూడదు - ఆ కోరికే - ఉపాంశువై - జపమౌతూంది-తన నిలువెల్లా అదే కోరిక.

అమ్మాయి-అక్కడ మరీ మూలుగుతూంది-కొండల పెట్టున వస్తున్నాయి-

నెప్పులు-తన పేరెత్తి పిలచి - గగ్గోలవుతూంది - తండ్రీ - దగబోలూను! తాను ఉండి - ఏం ప్రయోజనం?

అక్కడ ఉండలేదు -

అప్పుడే తూరుపు తెలావెలా బోతూంది.

అంతసేపూ రాపాడిన మనసు - ఆకలిలో - ఆలోచన లన్నింటినీ మింగేసి - తనలో తాను హరించుకుపోయింది. ఎంతసేపు ఎక్కడ తిరిగాడో - ఏ మాత్రమూ తెలియదు. కాళ్ళకు - బుద్ధివచ్చి - వాటంతట అవే - మళ్ళా యింటికి మళ్ళించుకు వచ్చి - విడిచినవి -

ఎండ ఎక్కుతూంది-

లోపలికి వెళుతూంటే - శకునపక్షిలాగా మామగారు - రొంటిన చేతులుపెట్టుకు - రొమ్ము విరిచి నిలుచుని - చూడగానే -దిగ్గరగా సకిలించి...ఎకసెక్కంగా... "తాతగారూ...దయచేయండి" అని పక్కకు తప్పుకున్నాడు... అత్తగారి ముఖం...కలకలలాడుతూంది...తనభార్య...

ఆమె వంకనైనా చూడకుండా అమాంతం...పురుడు వచ్చిన గదిలోకి...వెళ్ళి ఆ ముసలివా డవుతున్నా ననుకున్నవాడల్లా...పసివాడల్లే...చూసి పొంగిపోయినాడు... అమ్మాయి...పసిపాపను పక్కన బెట్టుకొని... దానితల మీదుగా తన చేయి తలగడగా చేసుకొని...జాపి...మునివేళ్ళతో...దగ్గరగా కూర్చుని -- మీదకు వాలినట్టుగా - ఏదో కబుర్లు చెబుతూన్న...మగని చెక్కిలి...చక్కిలిగిలి పెడుతూన్నది...ఇద్దరూ నవ్వుకుంటున్నారు...

అమ్మాయి, కొంచెం నీరసంగా ఉన్నది కాని, దానిని కమ్మేసే, కొత్త అందం, కొత్తకళ ఓడిపోతూంది - అక్కడ నుండి తప్పుకుందామనుకున్నాడు. తానలా చూస్తూ నిలుచుంటే, వాళ్ళు ఏమనుకుంటారో- పసివాళ్ళు - బిడియపడి-

అమ్మాయి - తనవంక చూసింది - చూపు తిప్పుకుని కనులతో, మగనికి సైగ చేసింది. అతడు తిరిగిచూసి, నవ్వి, తను ఉన్నానని అయినా సిగ్గులేకుండా, భార్యను ముద్దుపెట్టుకున్నాడు. అమ్మాయి, చెయి, అతని మెడమీదకు వేసింది.

అక్కడ నిలుచునేందుకు, ఎందుకో మొగం చెల్లక, యివతలకు వచ్చేశాడు--

అల్లుడూ, కూతురూ, మునుపటికన్న ఎక్కువగా పసిదానికి మూడునెలలు వెళ్ళినప్పటినుంచీ, చెట్టాపట్టాలు వేసుకుంటున్నారు. పసిదాన్ని వదలరు. ఓ నిమిషం ఏమారితే, ఎందరున్నారు, నెత్తిన ఎక్కించుకునేందుకు...! తన అత్తా, మామా, యిల్లాలూ, పసిపాపకు అంగరక్ష. తనజోలి ఎవరికీ అక్కరలేదు. తనవంక చూసేవారేలేరు --

ఉదయం నిదురలేచి, లోపలినుంచి, తోటలోకి రాబోతుంటే, అంతచీకటిలోనూ అమ్మాయి, అవతలగా వసారా చివరను కూర్చుని, చెవులు మూసుకుని కక్కుకుంటుంది.

పరుగెత్తుకు వెళ్ళి, నీళ్ళు తీసుకువచ్చి, ఆమె పక్కను ఉంచి, కూర్చుని వెన్ను రాస్తున్నాడు. పుక్కిలించి ఉమ్మేసి లేచి నిలుచున్నది. తూలిపడుతుందేమోనని, పట్టుకోబోయినాడు: "అక్కరలేదు, నాన్నా" అన్నది: "ఏం తల్లి, ఎందుచేతనమ్మా," ఎంతో ఆదుర్దాగా అడుగుతూ తల నిమురుతూన్నాడు: అమ్మాయి, తనవంకచూసి

చిరునవ్వుతో, తలవంచుకున్నది. పోయి పడుకో అమ్మా అని గది దాకా సాగనంపి, క్రిందకు దిగి చర చరా లోపలికి వెళ్ళాడు. వంట యింటి పక్కవసారాలో, అత్తగారు కాఫీ సామాను చుట్టూరా పరచుకుని ఆ ప్రయత్నంలో ఉంది - భార్య ఫలహారమేదో తయారు చేయడానికి, నాలుగూ చక్క బెడుతూంది: మామగారు, ఎదురుగుండా తులసికోట చప్టామీద కూర్చుని, కబుర్లు పేనుతున్నాడు.

అదంతాచూసి - మండుకొస్తూంది. అక్కడ అమ్మాయి అలా ఇదవుతూంటే, దిక్కూ మొక్కూ చూడకుండా యిక్కడ వీళ్ళు --

'ధుమధుమగా - అమ్మాయి, వెళ్ళబోసుకుంటూంది' అని తన భార్యకేసి ఉరిమాడు!

అప్పుడు, తాను గుమ్మంలో నిలుచున్నట్టు, అందరూ గమనించారు-

భార్య, తలఎత్తి తనవంక చూడనైనా లేదు. మాట వినిపించుకోలేదు.

అత్తగారు, తనలోతాను ఏమో గొణుక్కుంటూ నీళ్ళు ఉడికినాయో లేవో, అని మూతతీసి చూస్తూ, ఆ ధ్యాసలో ఉంది-

మామగారు గరుసెక్కిన గడ్డం-అరచేత్తో ఎగువకూ, దిగువకూ తడుముకుంటూ-ఎవరినీ ఉద్దేశించి కాకుండా ఎటువైపూ చూడకుండా-ఏదో మాట వరుసగా, "అలాగా పాపం-దానికి, అంతేకావాలి - ఏడాదికోసారి అంతే కావాలి" అని ఆడవాళ్ళవంక చూస్తూ, "ఎందుకూ మీరు ఉన్నారు-గళ్ళేలా పసరాగా-చూడండి, మీకన్న ఎన్ని వెనుకలు చిన్నది-మరి-చిచింద్రిలాగా, చూపిస్తే, అందుకు పోతూంది-అదీ వరుస-అలా ఉండాలి. అదీ, దాన్ని మించిన ఘనుడు నీ అల్లుడూ-ఎందుకు మళ్ళా మనం ఉన్నాం తగుదునమ్మా అంటూ---"

ఈ వరుస అంతా - తనకేసి చూస్తూ, పనసలాగా ఏ కరువు పెడుతున్నాడు - తనకు, తలదీసివేసినంత పనవుతూంది.

అమ్మాయి, అక్కడకువచ్చి వెనుకనిలుచుని ఉంది - తాతగారు -

"ఉన్నదానవు, ఉన్నట్టుగా ఊరికే ఉండలేవుటే, నీ యిల్లు నిలువెత్తున బంగారంగాను - నీకు తెలియకపోతే మీ అమ్మమ్మనూ, అమ్మనూ చూసి నేర్చుకోరాదూ - పోనీలే చెపితే వినేనేర్పు ఉంటేనా, యీ కాలపు పిల్లలకు. మరీ రెచ్చిపోతున్నారు. సరేలే, ఏలాగూ తలపెట్టావు కనుక, ముందు, ఓ గంపెడు కూతుళ్ళను కను - తరువాత కొడుకుల నెత్తుదువుగాని - మా వారడీ, నీ వారడీ, అంతకూ నీవే తలచుకోవాలి. ఎత్తుకు నెత్తిన మోసేందుకు, ఎదిగిన పిల్లలం యింటో పనీపాటా లేకుండా, మేం ఉన్నాముగా..."

మనుమరాలిని, అన్నీ అనివెక్కిరించాడు-అమ్మాయి, బుంగమూతి చేసుకుని, అందరితో బాటు కలసి, అంతలో నవ్వేసింది--

ఆ కిల కిలే, ఆ పవలంతా - తన తలలో, గలగల లాడుతూంది, కవ్విస్తూంది. బయట చీకటిపడినా, మనసులో మసక బారలేదు. వెన్నెలవుతూంది.

ఆ రాత్రి, అరుబయట, తను పడుకుంటూండగా, అడుగులు తడబడుతూ, తబుకులో తాంబూలం వంచుకుని తనభార్య, అన్ని యేళ్ళయినతరువాత, తన దగ్గిరకు - తన కోసం - వచ్చింది. తలవంచుకుని, నిలవబడినది. తలవంచుకున్నాడు.

తలల్లో అంతవరకు అలవికాని కలలన్నీ - పలక బారినవి - కాని, కలలు కలకలలాడకుండా, నోయనినోములు వాటిలో ఒక్కటి అయినా మిగలకుండా చెల్లాచెదరు చేయబోతున్నవి. అందులో, ఒక్కటి దక్కినా - ఆ జన్మకు ఎంతో ఎక్కిదక్కి --

మనసుతోబాటు చేతులూ, తన ప్రయత్నం లేకుండా ముందుకు జాచుకుంటూన్నవి - అందుకో బోతూండగా --

అమ్మాయి, తామిద్దరనీ చూసి, నవ్వుతూన్నట్టు - ఆ నవ్వు జ్ఞాపకం వచ్చింది - చేతులు వాలిపోయినవి.

తలఎత్తి, ఒకరునొకరు చూసుకున్నారు - యిద్దరి చూపుల్లో - ఆశను దక్కించుకోలేని అమాయకత్వం, పండించిన ముదుసలి కళ తెలివై - మెరిసింది. యిద్దరి నిట్టూర్పులూ దేనికదై ఒకటై ఒకదానికొకటి చిక్కకుండా దేనితోవను అది గాలిలో దోవచేసుకున్నది-

తన భార్య, తల మరీ వంచుకుని - అమ్మమ్మకు అమరిక అయిన ఒదుగుతో - పెద్దతనంతో - తిరిగితిరిగి చూడకుండా యింట్లోకి వెళ్ళిపోయింది. తనకు, ఇదే - ఎప్పటికిమల్లే - తానే.

* * *